హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో నాయకులు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు.



పామర్రులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పామర్రు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కన్వీనర్ ఓ గంగాధర ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుకను సరఫరా చేయాలని, అవసరమైన చోట ఇసుక రీచ్‌లు ప్రారంభించాలని కోరారు. కొత్త ప్రభుత్వం 100 రోజుల సంబరాల్లో మునిగి తేలుతోందని, భవన నిర్మాణ కార్మికుల విషయమై సరైన ప్రకటన విడుదల చేయలేదన్నారు. బిల్డింగ్ యూనియన్ రాష్ట్ర నాయకులు వేము పెదబాబు, సీపీఎం నాయకులు ముళ్లపూడి విల్సన్, కాటూరు నాగభూషణం, ఇంటి రాజు, ఏసుపాదం పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

గుడివాడరూరల్: ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకుడు ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉచిత ఇసుక హామీని అమలు చేయాలంటూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. అధికారంలోకి వస్తే వెంటనే ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక హామీని తుంగలో తొక్కిందన్నారు. ఇసుకను సరఫరా చేయకపోవడంతో అటు ప్రజలతో పాటు ఇటు భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను పంపిణీ చేయడంలో విఫలమైందన్నారు. సీపీఎం నాయకులు పి.లక్ష్మణరావు, సీహెచ్ శివనాగమల్లేశ్వరరావు, పి.రజనీ, సీహెచ్ రాంబాబు, సీహెచ్ నాగరాజు, వీరమ్మ, వెంకటేశ్వర్లు, సురేంద్ర పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

కూచిపూడి(మొవ్వ): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోవాలని, ఇసుక క్వారీలు తెరిచి వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తేవాలంటూ సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత ఇసుక అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు చిగురుపల్లి సుబ్రమణ్యం, సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, రాజశేఖర్, భవన నిర్మాణ కార్మికులు వేణుబాబు, తాతా యానాది, పాండురంగారావు, జగదీష్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ఇసుక అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు జహీరుద్దీన్‌ఖాన్ తెలిపారు. ఇసుక అందుబాటులో ఉంచాలని కోరుతూ వీరంకిలాకు సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లేక పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్టాక్ యార్డుల్లో ఇసుకను అందుబాటులో ఉంచాలని కోరారు.


గుడివాడ ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


మొవ్వ మండల భవన నిర్మాణ కార్మికుల నిరసన


వీరంకిలాకులో ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

గుడివాడరూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గూడపాటి ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని సీపీఐ సెంటర్‌లోని ఏఐటీయూసీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ కొమ్ముల సురేష్ ఆధ్వర్యంలో ఉచిత ఇసుక ఇవ్వాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాయకులు షేక్ ఖదీర్, ఎం.శేఖర్, టి.రాంబాబు, టి.నాగరాజు, డి.అప్పారావు, పి.దానయ్య, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



గుడివాడలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని లయన్స్‌క్లబ్ ప్రగతి గవర్నర్ గద్దే శేషగిరి అన్నారు. పట్టణంలోని కేటీఆర్ మహిళా కళాశాల్లో గుడివాడ లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రగతి ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషగిరి ప్రగతి సభ్యులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్వతనేని నిర్మల, కళాశాల సెక్రటరీ ఎంవీవీఎస్ ప్రసాద్, జెడ్సీ ఉపద్రష్ట రాంబాబు, ప్రగతి అధ్యక్షుడు నల్లూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఈఆర్ఎం హైస్కూల్లోని వాకింగ్ ట్రాక్ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు సక్రమంగా నిర్వహించాలి

మండవల్లి: దసరా మహోత్సవాలు సక్రమంగా నిర్వహించుకోవాలని మండవల్లి ఎస్సై శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో దసరా ఉత్సవాల కమిటీ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొల్లేరులో రోడ్లకు మరమ్మతులు చేయండి

కైకలూరు: వరదలకు దెబ్బతిన్న కైకలూరు నియోజకవర్గం కొల్లేరు గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఏలూరులో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికు వడ్డీ సాధికారక కన్వీనర్ బలే ఏసురాజు వినతిపత్రం శుక్రవారం అందించారు. కైకలూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజులు కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారు. వరదల సమయంలో గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు రోడ్డులో మూడు ప్రాంతాల్లో భారీ గండ్లు పడ్డాయని ఏసురాజు పేర్కొన్నారు. దీంతో కైకలూరు మండలం శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, గోకర్ణపురం, కొల్లేటికోట, పందిరిపల్లిగూడెం గ్రామాల విద్యార్థులు నెల రోజులకు పైడి బడులకు వెళ్లడం లేదన్నారు.

సంపూర్ణ ఆహార పోషణ కిట్ల పంపిణీ

మండవల్లి: మండవల్లి 5, 6 అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ మెండా ఝాన్సీ సంపూర్ణ ఆహార కిట్లను గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ఈ కిట్లు ఎంతో మేలు చేస్తాయని ఆమె చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మండవల్లి: రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు నాబార్డ్ ఆర్థిక సాయంతో లింగాల సప్తగిరి బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమంలో పెరికెగూడెంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాలకు, పొదుపు సంఘాలకు అవార్డు కళాజాత టీము ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

ముదినేపల్లి రూరల్ : ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడిని ఏపీటీఎఫ్ నేతలు శుక్రవారం సత్కరించారు. మండలంలోని కొరగుంటపాలెం యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ఎ.సాల్మన్‌రాజు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నేతలు బేతాల రాజేంద్రప్రసాద్, సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ముదినేపల్లిలో సాల్మన్‌రాజు దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఎంపీడీఓగా రామకృష్ణ

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎంపీడీఓ యద్దనపూడి రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పామర్రు మండలం నుంచి ముదినేపల్లికి రామకృష్ణ బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా విధులు నిర్వహించిన పి.మల్లీశ్వరి కృష్ణా జిల్లా నందివాడ మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన రామకృష్ణకు కార్యాలయ సిబ్బంది రమణరావు, సుబ్బారావు స్వాగతం పలికారు.

పలువురికి ఉత్తమ అవార్డులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో హై 5 యూత్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ, పార్థసారథి దంపతుల ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులను అందించారు. ఘంటసాల, ఎన్టీఆర్ కళా పీఠం వ్యవస్థాపకుడు మురళీకృష్ణ, గుడ్లవల్లేరు కార్యదర్శి నరసింహారావు, అభినవ్‌కు తెలంగాణా రాష్ట్ర సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ ఆంజనేయ కుమారి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపారుపూడి: పెదపారుపూడిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.


వ్యక్తిత్వ వికాసంతో లక్ష్యాల సాధన

కైకలూరు: వ్యక్తిత్వ వికాసంతో జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కె.సుజాత అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై సదస్సు నిర్వహించారు. సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కేఎస్ ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఏలూరు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, కెరీర్ కౌన్సెలర్ జి.ప్రవీణ్‌కృష్ణ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సెట్‌వెల్ మేనేజర్ వీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా సుధాకర్‌రావు

పామర్రు: పామరు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కె.సుధాకర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చల్లపల్లి గ్రామం నుంచి బదిలీపై పామర్రుకు వచ్చారు. గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఉప సర్పంచ్ బాలవెంకటేశ్వరరెడ్డి, గ్రామ కార్యదర్శి అబ్దుల్‌సలీం ఆయనకు అభినందనలు తెలిపారు.

వరాలివ్వమ్మా ధనలక్ష్మీ దేవీ


గోనెపాడులో గాయత్రీదేవిగా కనకదుర్గమ్మతల్లి


మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..


బుచ్చమ్మ ఆశ్రమంలోని పర్వత వర్ధనీదేవి గాయత్రీమాతగా..


లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ


తోట్లవల్లూరు శివాలయంలో శ్రీగాయత్రీదేవిగా అమ్మవారు

కైకలూరు: దసరా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం కైకలూరు శ్యామలాంబ అమ్మవారు ధనలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కైకలూరు జూనియన్ సివిల్ కోర్టు జడ్జి ఎం.శివకిరణ్ శ్యామలాంబను దర్శించుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దేవీ ఖడ్గనామపూజ, లలిత నామకుంకుమార్చనను సయ్యపురాజు గుర్రాజు దంపతులు నిర్వహించారు.

వివిధ ఆలయాల్లో...

కైకలూరు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవీగా దర్శనమిచ్చారు. షిర్డీ సాయిబాబా మందిరంలో దశావతారాల్లో భాగంగా కూర్మావతారం భక్తులను ఆకట్టుకుంది. ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో అమ్మవారు గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ దర్శనం

మండవల్లి: మండలంలోని మండవల్లి, అయ్యవారి రుద్రవరం, పెరికెగూడెం, లింగాల, భైరవపట్నం గ్రామాల్లో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పెరికెగూడెంలో గాయత్రీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్చరణ విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక హోమాలను చేపట్టారు. అంగలూరు, డోకిపర్రు, గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం, విన్నకోటలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు.

తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో ఉత్సవాల రెండో రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


కైకలూరు శ్యామలాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న జడ్జి శివకిరణ్


గురజలో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు


గుడివాడ భీమేశ్వరాలయంలో..

గాయత్రీదేవిగా అమ్మవారు

ముదినేపల్లి రూరల్ : దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో శుక్రవారం దర్శనమిచ్చారు. దేవపూడి విజయదుర్గాంబ, సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి, అల్లూరు సోమేశ్వరస్వామి, వడాలి శివాలయంలో గాయత్రీదేవీగా అలంకరించి పూజలు చేశారు. గురజ శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవీగా అలంకరించి పూజలు చేశారు. పెయ్యేరులో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారికి పలువురు దంపతులు పూజలు చేశారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణం, పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బంటుమిల్లిరోడ్‌లోని శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శుక్రవారం గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 7వ వార్డులో ఉన్న శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయంలో గాయిత్రీదేవిగా కొలువుదీరారు. నీలామహాల్‌రోడ్‌లోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళగౌరీదేవిగా దర్శనమిచ్చారు.

గాయత్రీ దేవిగా అమ్మవారు

పామర్రు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని, బుచ్చమ్మ ఆశ్రమంలోని రామలింగేశ్వర స్వామి సమేత పర్వత వర్ధనీ దేవి అమ్మవార్లను శుక్రవారం గాయత్రీ దేవిగా అలంకరించి విశేషపూజలు చేశారు. అంకమ్మతల్లి ఆలయంలో గాయత్రీ మాతగా, సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి విశేష పూజలునిర్వహించారు.

ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు

గుడివాడరూరల్: తటివర్రురోడ్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీధన లక్ష్మీ దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. చిన ఎరుకపాడులో వేంసియున్న శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.35లక్షల విలువైన నోట్లతో అలకరించారు. 108 స్వర్ణ పుష్పాలతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.


చిన ఎరుకపాడులో అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.42.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొండపాడు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి మరో రూ.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీఓ విష్ణుప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, సర్పంచ్ చోరగుడి సురేఖ, నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటరత్నం, వీర బసవయ్య, కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని దొండపాడులో శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, సర్పంచ్ చోరగుడి సురేఖ పాల్గొన్నారు.

యువతపై ఆధారపడి ఉన్న దేశ భవిష్యత్


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ప్రొఫెసర్ బసవేశ్వరరావు, కళాశాల పాలకవర్గం, ప్రిన్సిపాల్

కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు

గుడివాడరూరల్: దేశ భవిష్యత్ నేటి యువత చేతుల్లోనే ఆధారపడి ఉందని కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు(ఏఎన్ఆర్) కళాశాల స్నాతకోత్సవ(గ్రాడ్యుయేషన్) డే వేడుకల్లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పుట్టిన నేలను, తాగిన నీళ్లను, సాంస్కృతి, సంప్రదాయాలను ఎప్పుడూ మర్చిపోకూడదన్నారు. అనంతరం ప్రతి కోర్సులో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు ఎంసీఏ నుంచి సీహెచ్ సుమశ్రీ, ఎంబీఏ నుంచి పి.లావణ్య, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ నుంచి టీఎల్‌కే శ్రావ్య, ఎంఎస్సీ కెమిస్ట్రీ నుంచి మణికంఠకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కాట్రగడ్డ సింహాద్రి అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల రిపేరుకు ప్రభుత్వం సాయం అందించాలి

తోట్లవల్లూరు: కృష్ణానది వరదల కారణంగా లంకల్లో రైతుల పంటలు దెబ్బతినటంతోపాటు విద్యుత్ మోటార్లు, పంపుసెట్లు, ఆయిల్ ఇంజిన్లు, ట్రాక్టర్లు దెబ్బతిన్నాయని, వాటి రిపేరుకు అవసరమైన నగదును ప్రభుత్వమే అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చాగంటిపాడులో ఆయన శుక్రవారం పర్యటించి రైతులను పరామర్శించటంతోపాటు దెబ్బతిన్న మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు, ట్రాక్టర్ల వివరాలు తెలుసుకున్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం, చాగంటిపాడు సొసైటీ నాయకులు డేవిడ్ భాస్కరరావు, నాగేశ్వరరావు, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తం

- **నందివాడ ఎంపీడీఓగా మల్లీశ్వరి**

నందివాడ: నందివాడ ఎంపీడీఓగా పి.మల్లీశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీఓను సత్కరించి, అభినందనలు తెలిపారు.

- **ఉచిత పశు వైద్యశిబిరం**

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో వడ్లమన్నాడులో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ మాజీ చైర్మన్ పాట్లూరి శ్రీవెంకటేశ్వరరావు, లయన్స్ సభ్యుడు పెన్నేరు ప్రభాకరరావు ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ లక్ష్మీనారాయణతో పాటు వైద్యుల బృందం పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు.

- **కొలువుల్లో చేరిన ఉద్యోగులు**

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయ విస్తరణాధికారిగా టి.విజయసారథి శుక్రవారం విధుల్లో చేరారు. కౌతవరం, వేమవరం, కూరాడ గ్రామ కార్యదర్శులుగా ఎ.జయలక్ష్మి, పి.డి.నాగ మల్లేశ్వరరావు, జన్ను ఈశ్వరికుమారి బాధ్యతలు స్వీకరించారు. వీరిని కార్యదర్శి నరసింహారావు, ఉద్యోగులు అభినందించారు.

- **మండల అభివృద్ధికి కృషి**

పామర్రు: నూతనంగా మండలానికి వచ్చిన అధికారులు మండల సర్వతోముఖాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో కొత్తగా వచ్చిన అధికారులను శుక్రవారం అభినందించారు. ఎంపీపీ మాట్లాడుతూ పామర్రు ఎంపీడీఓగా చంద్రలపాడుమండలం నుంచి కె.జ్యోతి బదిలీపై వచ్చారన్నారు. పీఆర్ ఏఈగా మొవ్వ మండలం నుంచి బత్తిన రామారావు పామర్రుకు వచ్చారని తెలిపారు. సూపరింటెండెంట్‌గా మచిలీపట్నం జెడ్పీ నుంచి సత్యనారాయణ వచ్చారన్నారు. కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

- **ఉద్యోగుల బదిలీలు, చేరికలు**

పమిడిముక్కల: మండలంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల్లోని పలువురు ఉద్యోగుల బదిలీలు, చేరికలు శుక్రవారం జరిగాయి. మండల సర్వేయర్ మణికుమార్ గుడివాడ టౌన్‌కు బదిలీ అయ్యారు. మచిలీపట్నం టీఎఫ్ నుంచి డి.సుధీర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆర్ఐగా గన్నవరం నుంచి డి.కిరణ్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అదేవిధంగా రెండు శాఖల్లో బదిలీపై వచ్చిన ఉద్యోగులంతా శుక్రవారం విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు.

- **వడ్లమన్నాడులో రైళ్లు ఆపాలి**

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడు రైల్వేస్టేషన్‌లో మచిలీపట్నం నుంచి వైజాగ్, బీదర్ వెళ్లే రైళ్లను ఆపాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి గురువారం విన్నవించామని రైతు క్లబ్ కన్వీనర్ ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. కూలి పనుల నుంచి సాఫ్ట్‌వేర్ రంగం వరకు వివిధ అవసరాలపై వెళ్లే ప్రయాణికులు తమ ప్రాంతంలో ఉన్నారని ఎంపీకి వివరించినట్లు పేర్కొన్నారు.

- **ట్రస్టీగా సీతారాం ప్రమాణ స్వీకారం**

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వంశ పారంపర్య ట్రస్టీగా వల్లభనేని సీతారాం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ పాలిటెక్నిక్ కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.